క్లుప్తంగా

తప్పు చేసిన వారిని సమర్థించడమా..?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ పూజ చేసుకుంటున్న సమయంలో అధికార పార్టీకి చెందిన కొందరు మద్యం సేవించి విద్యార్థులు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేసి విధ్వంసం సృష్టించారని, వీరిని శిక్షించాల్సింది పోయి వెనుకేసుకొచ్చే యత్నం చేయడం సిగ్గుచేటని తోటపల్లిగూడూరుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పామంచి దుర్గారావు విమర్శించారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. అధికార పార్టీకి చెందిన సురేష్‌నాయుడు.. కోడూరులో ప్రెస్‌మీట్ పెట్టి అనవసర వ్యాఖ్యలు చేశారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో తోటపల్లిగూడూరు మండలంలో అభివృద్ధి జరగలేదని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మాట్లాడే స్థాయి ఆయనకు లేదని చెప్పారు. నేతలు కంజి శ్రీరాములు, సురేష్, కొండూరు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ బహూకరణ

నెల్లూరు(బృందావనం): వయోవృద్ధులైన భక్తుల కోసం నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానానికి వీల్‌చైర్‌ను రంగనాథ, రాజరాజేశ్వరి భక్తమండళ్ల ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డికి వీటిని నిర్వాహకులు మెంటా రామ్మోహన్‌రావు, రాజేంద్రప్రసాద్ ఇచ్చారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

నెల్లూరు (పొగతోట): ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లొమా విద్యార్హతతో 18 నుంచి 40 ఏళ్లలోపు యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలను కల్పించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 91608 88066, 99888 53335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హౌసింగ్ ఏఈ సస్పెన్షన్

నెల్లూరు(అర్బన్): మనుబోలు మండల హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్న రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ ఉత్తర్వులను గురువారం రాత్రి జారీ చేశారు. మర్రిపాడు ఏఈగా గతంలో పనిచేశారు. అప్పట్లో హౌసింగ్ నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడ్డారు. దీనిపై నివేదిక అందడంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు.

షెడ్యూలింగ్‌కు వాట్సాప్ నంబర్

కొడవలూరు: కొనుగోలు కేంద్రాల్లో షెడ్యూలింగ్ కోసం నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గండవరంలో గల కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతుల కోసం పౌరసరఫరాల శాఖ 73373 59375 వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకునే ముందుగా ఈ నంబర్‌కు హాయ్ అనే సందేశం పంపితే షెడ్యూలింగ్ మెసేజ్ వస్తుందని తెలిపారు. పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏఓ లక్ష్మి, వీఏఏ కవిత, బచ్చు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రారంభం

స్వచ్ఛభారత్ ద్వారా మండలంలోని గండవరం పంచాయతీకి ట్రాక్టర్ మంజూరైంది. దీన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజకుమారి మాట్లాడారు. ట్రాక్టర్ సదుపాయం లభించడంతో గ్రామంలోని చెత్తాచెదారాలను డంపింగ్ యార్డుకు సులువుగా తరలించి పరిశుభ్రంగా ఉంచుకునే వెసులుబాటు కలిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, జూనియర్ సహాయకుడు రవిచంద్ర, సురేష్ పాల్గొన్నారు.

నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

ఇందుకూరుపేట: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోహన్‌రావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహాలను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రూ.1.8 లక్షలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఇళ్లు పూర్తికాకుండా ఏ దశలో ఉన్నా ఎస్సీలు, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలను అందజేయనుందని పేర్కొన్నారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో పుస్తకాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ గుణశేఖర్, ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి గురువారం ఆవిష్కరించారు. ఫార్మకాలజీ ఫార్మకోగ్నోసి ప్రిన్సిపల్స్ అండ్ ప్రాక్టీస్ అనే పుస్తకాన్ని ప్రిన్సిపల్ మాధవీలత, ప్రొఫెసర్ కృష్ణచైతన్య, అసోసియేట్ ప్రొఫెసర్ రమాదేవి రచించారు.

అంతా మిల్లర్ల చేతుల్లోనే..

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇదీ తంతు
- ఆలస్యమవుతున్న చెల్లింపులు
- దళారుల రంగప్రవేశం



సౌత్‌మోపూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రం

నెల్లూరు సిటీ: ధాన్యం కొనుగోలు నిమిత్తం కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. నెల్లూరు రూరల్ మండలంలో పది కేంద్రాలను ఏర్పాటు చేసినా, వాటిపై రైతులు కన్నెత్తి చూసే పరిస్థితి కరువవుతోంది. రూరల్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను 'సాక్షి' గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా పలు అంశాలు బయటపడ్డాయి. ఇక్కడ కొనుగోళ్ల దందా మిల్లర్ల చేతుల్లోనే నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుట్టికి రూ.రెండు వేల కమీషన్‌ను మిల్లర్ల వద్ద దళారులు తీసుకొని నగదును త్వరగా ఇస్తామని చెప్తున్నారు. దీంతో డబ్బులు సైతం త్వరగా వస్తాయనే ఉద్దేశంతో మిల్లర్లకు ధాన్యాన్ని అన్నదాతలు విక్రయిస్తున్నారు. ఏ గ్రేడ్ పుట్టికి రూ.19,720, బీ గ్రేడ్‌కు రూ19,550 మేర చెల్లిస్తున్నారు.

పలువురికి ఆదాల పరామర్శ



నెల్లూరు సిటీ: పెనుబర్తిలో పలువుర్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. గ్రామ ఉప సర్పంచ్ వెదనపర్తి వెంకటేశ్వర్లురెడ్డి తల్లి రాజమ్మ ఇటీవల మరణించిన నేపథ్యంలో కుటుంబసభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మోపూరు మోహన్‌రెడ్డి తల్లి రామసుబ్బమ్మ ఇటీవల మరణించడంతో వారిని పరామర్శించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నెల్లూరు రూరల్ అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్లపల్లి వీరరాఘవరెడ్డి, నేతలు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, మల్లు సుధాకర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, కొండేటి నరసింహరావు, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని అపోలో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో ఇప్పటి వరకు వందకుపైగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామని హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కిడ్నీ సమస్యలు.. కాపాడుకునే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని ఆస్పత్రిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆస్పత్రి నెఫ్రాలజీ విభాగాధిపతి చక్రవర్తి, నెఫ్రాలజిస్ట్ మస్తాన్‌వలీ మాట్లాడారు. సమస్యను ముందుగానే గుర్తిస్తే తక్షణమే వైద్య చికిత్స ద్వారా సరిచేసేందుకు వీలవుతుందని చెప్పారు. ఆస్పత్రి యూనిట్ హెడ్ బాలరాజు పాల్గొన్నారు.

ఎఫ్ఎన్వో, ఎమ్మెన్వో పోస్టుల మంజూరుకు వినతి



డీఎంఈకి వినతిపత్రమిస్తున్న హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి కనీసం వంద ఎఫ్ఎన్వో, ఎమ్మెన్వో పోస్టులను మంజూరు చేయాలని హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సొసైటీ సభ్యులు కోరారు. దర్గామిట్టలోని ఆస్పత్రికి తనిఖీ నిమిత్తం వచ్చిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అడ్మిన్) వెంకటేష్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం హెచ్‌డీఎస్ కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు మాట్లాడారు. పెద్దాస్పత్రిలో వీల్‌చైర్, స్ట్రెచర్లు పట్టేందుకు సైతం మనుషుల్లేరని చెప్పారు. 200 మంది ఉండాల్సిన చోట, 18 మంది ఎఫ్ఎన్వోలు, ఎమ్మెన్వోలే పనిచేస్తున్నారని చెప్పారు. ఐసీయూకు వెళ్లేందుకు లిఫ్టులు పనిచేయడం లేదన్నారు. కాగా 54 మందిని నియమించేందుకు చర్యలు చేపట్టామని వెంకటేష్ చెప్పారు. హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు మొగరాల సురేష్, బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



నెల్లూరు (పొగతోట): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు బహుమతులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం అందజేశారు. సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో కిడ్నీ వ్యాధులకు చెక్



మాట్లాడుతున్న నాగ అలేఖ్య

నెల్లూరు(అర్బన్): సీరమ్ క్రియాటినిన్, బ్లడ్ యూరియా లాంటి రక్త పరీక్షలు, స్కానింగ్ పరీక్షలను చేయించుకోవడం ద్వారా కిడ్నీ వ్యాధులకు చెక్ పెట్టొచ్చని ఎనెల్ స్పెషాల్టీ హాస్పిటల్ నెఫ్రాలజిస్ట్ నాగ అలేఖ్య పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కిడ్నీ వ్యాధులపై మాగుంట లేఅవుట్లోని ఎనెల్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డయాబెటిస్, బీపీ ఉండే వారు కిడ్నీ పరీక్షలను ఏడాదికోసారి చేయించుకోవాలని కోరారు.

వేడుకగా వెణ్ణత్తాళి ఉత్సవం



వెణ్ణత్తాళి ఉత్సవం



హనుమంతసేవ

నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారికి వెణ్ణత్తాళి ఉత్సవాన్ని వేడుకగా గురువారం నిర్వహించారు. హనుమంతసేవను రాత్రి జరిపారు. ఉభయకర్తగా మాగుంట శ్రీనివాసులురెడ్డి వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో మోహినీ అవతారం, పూలంగిసేవ, బంగారు గరుడసేవను శుక్రవారం నిర్వహించనున్నామని ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈఈఎఫ్ఐ ఉపాధ్యక్షుడిగా సూరిబాబు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఈఎఫ్ఐ) ఆలిండియా ఉపాధ్యక్షుడిగా దుగ్గిరాల సూరిబాబు ఎన్నికయ్యారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఈఈఎఫ్ఐ మహాసభలను ఈ నెల పది నుంచి 12 వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా ఈయనకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నేతలు సత్యనారాయణ, శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, పెంచలప్రసాద్ తదితరులు అభినందనలను తెలియజేశారు.

మాదరాజుగూడూరులో ప్రజా చైతన్య యాత్ర



సీపీఎం నేతల ధర్నా

నెల్లూరు సిటీ: మాదరాజుగూడూరులోని కట్టకింద పొరంబోకు భూములకు డీకేటీ పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలూరు తిరుపాల్ పేర్కొన్నారు. మాదరాజుగూడూరులో గురువారం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అడంగల్‌లో నమోదు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వీటికి డీకేటీ పట్టాలను మంజూరు చేయాలని కోరారు. పార్టీ మండల కమిటీ సభ్యులు రమణ, వెంకయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారికి ఘనంగా వీడ్కోలు



నెల్లూరు (పొగతోట): జిల్లాలో మత్స్యశాఖలో ఏడీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై కర్నూలు డిప్యూటీ డైరెక్టర్‌గా వెళ్తున్న డాక్టర్ రంగనాథ్ బాబును ఘనంగా సత్కరించారు. మత్స్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు నాగేశ్వరరావు, ఆప్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

నెల్లూరు (టౌన్): ఎలాంటి పత్రాల్లేకుండా తిరుగుతూ రవాణా అధికారుల తనిఖీల్లో పట్టుబడిన వాహనాల వేలాన్ని స్థానిక రవాణా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మొత్తం 17 వాహనాలను వేలం వేయగా, రూ.1.72 లక్షల ఆదాయం వచ్చింది. దీన్ని సీఎఫ్ఎమ్మెస్ చలానా ద్వారా ప్రభుత్వ ఖాతాకు జమ చేయనున్నారు. ఇన్‌చార్జి ఆర్టీఓ బాలమురళీకృష్ణ, ఎమ్వీఐ కార్తీక్ పవన్‌కుమార్, ఏఎమ్వీఐ పూర్ణచంద్రరావు, ఏఓ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి నోబుల్ సర్టిఫికెట్



నెల్లూరు(అర్బన్): నెలల బిడ్డకు నోబుల్ వరల్డ్ సర్టిఫికెట్‌ను కలెక్టర్ ఆనంద్ గురువారం అందజేశారు. వివరాలు.. ఆత్మకూరు మండలం రామస్వామిపల్లికి చెందిన చందలూరి వీరు, ఊహ దంపతుల బిడ్డ వీరశ్రీయాన్ వయస్సు ఆర్నెల్లు. కూరగాయలు, పండ్లు, జంతువుల ఫొటోలను వరుసగా ముందు పెట్టి, ఏది చెప్తే దాన్ని చూడటం, తాకడం వంటివి చేస్తున్నాడు. దీంతో నోబుల్ వరల్డ్ నిర్వాహకులకు తల్లిదండ్రులు తెలియజేశారు. సదరు సంస్థ ప్రతినిధులు నిర్వహించిన పరీక్షలో నెగ్గడంతో సర్టిఫికెట్, మెడల్‌ను ప్రకటించారు. దీన్ని కలెక్టర్ చేతుల మీదుగా కలెక్టరేట్లో అందుకున్నారు.

యువత పోరు గ్రాండ్ సక్సెస్



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని నిర్వహించిన యువత పోరు కార్యక్రమం విజయవంతమైందని పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున పేర్కొన్నారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందనేందుకు ఇదో ఉదాహరణ అని చెప్పారు. యువకులు, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగావకాశాలను కల్పించడంలేదని ఆరోపించారు. రానున్న రోజుల్లో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. అనంతరం పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7100 కోట్లు ఉండగా, రాష్ట్ర బడ్జెట్లో రూ.2,600 కోట్లనే కేటాయించారని విమర్శించారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని ధ్వజమెత్తారు. సమస్యలపై ప్రశ్నిస్తానన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

కవయిత్రి మొల్లకు నివాళులు



నెల్లూరు(బారకాసు): రామాయణాన్ని తెలుగువారికి అర్థమయ్యేలా రచించిన కవయిత్రి మొల్ల అని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి గురువారం నివాళులర్పించిన అనంతరం కాకాణి మాట్లాడారు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం, తన కృషితో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సర్వేపల్లి ప్రాంతం నుంచి తరలిపోకుండా, శాశ్వత భవనాలతో నిర్మాణం ప్రారంభమయ్యేందుకు దోహదపడిందని చెప్పారు.

ఉత్సాహంగా వైజ్ఞానిక ప్రదర్శన





నెల్లూరు (టౌన్): సరస్వతీనగర్‌లోని కిశోర్స్ రత్నం హైస్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం నిర్వహించారు. పోస్టర్ ప్రదర్శన, ఇన్నోవేషన్, నమూనాలు, పరిశోధనాత్మక ప్రాజెక్టులు తదితరాలను విద్యార్థులు ప్రదర్శించారు. సమగ్ర శిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ఏఓలు తుహీనా, సునీల్, ప్రిన్సిపల్స్ మణిమాల, ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం): ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో గల కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. పూజలను కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా రామాలయం గోపాలకృష్ణ దంపతులు, నరసింహరావు, దేవకీదేవి తదితరులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

ఘన సన్మానం



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో రూరల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు గురువారం సత్కరించారు. పార్టీ రూరల్ నియోజకవర్గ దివ్యాంగుల విభాగ అధ్యక్షుడిగా నియమితులైన సాదు పెంచలరెడ్డి, 23వ డివిజన్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నారాయణరెడ్డి తదితరులు కృతజ్ఞతలను తెలియజేశారు. యనమల మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని 21, 34వ డివిజన్లకు చెందిన పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. నిస్సార్, అల్లూరు రాజకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ సోమిరెడ్డి రాధాకృష్ణారెడ్డి సతీమణి భువనేశ్వరి ఇటీవల మృతి చెందడంతో సరస్వతీనగర్‌లోని వారి నివాసంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నేతలు వెంకయ్య, శ్రీనివాస్, మల్లు సుధాకర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, ఏసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముఖ ద్వార పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: బారాషహీద్ దర్గా ముఖ ద్వార నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపనను వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం చేపట్టారు. కలెక్టర్ ఆనంద్, కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ తహసీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏఐఐటీఏ జాయింట్ సెక్రటరీగా దీపక్



నెల్లూరు(బృందావనం): ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ఐటీ అసోసియేట్స్ (ఎఫ్ఏఐఐటీఏ) 2025 – 27 సంయుక్త కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన బొమ్మిశెట్టి దీపక్ ఎన్నికయ్యారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమకు ఇది గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. డీలర్ – వెండార్ సంబంధాలు ఆయన ఆధ్వర్యంలో మెరుగుపడతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

హోలీ పేరిట హద్దు మీరితే చర్యలు

నెల్లూరు(క్రైమ్): హోలీ పేరిట హద్దులు మీరి ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 67 పికెట్లు, 41 మొబైల్ పార్టీలతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగు చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలకు హోలీ శుభాకాంక్షలను తెలియజేశారు.